క్లుప్తంగా

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

నెల్లూరు సిటీ: మహాశివరాత్రిని పురస్కరించుకొని శైవక్షేత్రాలకు జిల్లా నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు నడపనున్నారు. ఉదయగిరి నుంచి భైరవకోన, సిద్దేశ్వరానికి 20.. ఆత్మకూరు నుంచి సోమశిలకు ఐదు.. నెల్లూరు నుంచి కోటితీర్థం, గండవరం.. మైపాడు, కాటేపల్లికి నాలుగు చొప్పున.. కందుకూరు నుంచి మొగిలిచర్లకు 60 బస్సులను నడపనున్నారు. సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నారు.

మహాశివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలకు అంకురార్పణను సోమవారం రాత్రి నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝ్జుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

యువకుడి బలవన్మరణం



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలోని మూడో ట్రాక్‌పై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడు 25 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి.. నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఆందోళన

నెల్లూరు సిటీ: ఫీజు కట్టలేదనే కారణంతో పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రూరల్ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, విద్యార్థి సంఘ నేతలు ఆందోళనను సోమవారం చేపట్టారు. కళాశాల ఎదుట దాదాపు ఆరు గంటల పాటు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కళాశాలలో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపల్‌కు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదని ఆరోపించారు. అనంతరం రూరల్ పోలీసులు చేరుకొని ఏబీవీపీ నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థులకు రూరల్ సీఐ వేణు నచ్చజెప్పారు. సమస్యను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్, సిటీ సెక్రటరీ సమీర్, సభ్యులు సుమన్, లోకేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాదేవ యజ్ఞం రేపు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): మహాకుంభమేళ జలాలతో నగరంలోని పురమందిరంలో మహాదేవ యజ్ఞాన్ని బుధవారం నిర్వహించనున్నామని వాస్తుశాస్త్ర నిపుణుడు దువ్వూరు కస్తూరి లీలామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శాంతినగర్‌లోని నిర్మలసౌధలో నిర్మల నరసింహారెడ్డితో కలిసి సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గోపూజతో సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభంకానుందని చెప్పారు. యజ్ఞ ద్రవ్యాలను ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు.

యువ సమ్మేళనంలో ఉత్తమ ప్రతిభ

నెల్లూరు(అర్బన్): కేరళలోని ఎర్నాకుళంలో ఈ నెల 17 నుంచి 21 వరకు నిర్వహించిన అంతర్రాష్ట్రీయ యువ సమ్మేళనంలో నెహ్రూ యువ కేంద్రం, యువజన వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో సతీష్‌కుమార్, మురళీధర్ నిలిచారు. షార్ట్ ఫిల్మ్‌లో నెల్లూరుకు మొదటి స్థానం లభించింది. వంటల పోటీల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అవార్డులను కేరళ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషనర్ వివేక్ శశిధర్ ప్రదానం చేశారు. అవార్డులతో నెల్లూరొచ్చిన వీరిని జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి సోమవారం అభినందించారు.

వీడని బెట్టింగ్ భూతం

- ఛాంపియన్స్ ట్రోఫీపై పందేల జోరు
- జూదంతో జీవితాలు నాశనం
- విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు



నెల్లూరు(క్రైమ్): ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ అభిమానులను కనువిందు చేస్తుంటే బెట్టింగ్‌రాయుళ్లకు కాసులు కురిపిస్తోంది. బంతి బంతికీ పందెం కాస్తూ పంటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వ్యసనంతో అవీ ఇవీ కుదువపెట్టడంతో పాటు అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ కొందరు పందేలు కాస్తున్నారు. ట్రోఫీ ముగిసే నాటికి ఎంతో మంది ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం పొంచి ఉంది.

రూ.కోట్లల్లో బెట్టింగ్‌లు

జిల్లాలోని ప్రధాన పట్టణాల మొదలుకొని పల్లెల వరకు బెట్టింగ్ జాఢ్యం పాకింది. ప్రధానంగా నెల్లూరు, కావలి, కందుకూరుల్లో జోరుగా సాగుతోంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఆదివారం జరిగిన పోరులో రూ.కోట్లల్లో బెట్టింగ్‌లు జరిగాయి. వాస్తవానికి గతంలో క్రికెట్ బెట్టింగ్ డాన్ల నుంచి బుకీలు, సబ్ బుకీలు, పంటర్లు ఇలా అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపారు. దీంతో బెట్టింగ్ కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఇది మళ్లీ ప్రారంభమైంది. ఆదిలోనే దీనికి కళ్లెం వేసే దిశగా పోలీస్ శాఖ నిఘా పెట్టాల్సిన అవసరముంది. బెట్టింగ్‌ల జోలికెళ్లకుండా తమ పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూనే ఉండాలి.

అంతా ఆన్‌లైన్లోనే..

గోడకు పెద్ద టీవీ.. దాని ముందు పదుల సంఖ్యలో పంటర్లు.. నోట్ల కట్టల్ని లెక్కపెడుతూ నిర్వాహకులు.. ఇదంతా ఒకప్పటి వ్యవహారం. నిఘా పెరగడంతో నిర్వాహకులు ఆన్‌లైన్లోకి మారిపోయారు. ఆన్‌లైన్ పందేన్ని రెండు విధాలుగా నిర్వహిస్తున్నారు. మొదట నిర్వాహకులు బెట్టింగ్ వెబ్‌సైట్లలో సభ్యులుగా చేరుతున్నారు. వీరికి ఓ రహస్య ఐడీ, పాస్‌వర్డ్‌ను ఇస్తారు. దీని ద్వారా అడ్మిన్‌గా ఉంటూ ఆన్‌లైన్లోనే మరికొందర్ని యూజర్లుగా చేసుకుంటారు. వీరికి ఆయా బెట్టింగ్ వెబ్‌సైట్ లింక్‌లను పంపి, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించి పందేలు కాస్తున్నారు. రెండో విధానంలో ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్న క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల వివరాలు తెలిపి అడ్వాన్స్‌లు తీసుకొని అవకాశం కల్పిస్తారు. ఓడినా, గెలిచినా నగదు లావాదేవీలన్నీ ఆన్‌లైన్లోనే జరుగుతున్నాయి.

అత్యాశకు పోయి.. అప్పుల పాలై

యువతకు బెట్టింగ్ వ్యసనంలా మారింది. చేతిలో స్మార్ట్‌ఫోన్లు ఉంటే చాలు బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని ఇంటి నుంచే ఆడుతున్నారు. మనీ వాలెట్‌లోకి బ్యాంక్ ఖాతా, ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌లలో రిజిస్టరైన ప్రధాన బుకీలు వాటిని సబ్ బుకీలు, ఏజెంట్లకు అప్పగించి తెరవెనుక నుంచి వ్యవహారం నడిపిస్తున్నారు. ప్రతి బంతికీ బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో యువత, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, మైనర్లు చిక్కుకుపోతున్నారు. ఆర్థిక స్తోమత లేకపోయినా, అత్యాశకు పోయి చేతులు కాల్చుకుంటున్నారు. ఆర్థికంగా చితికిపోయి నేరాలు చేసేందుకూ వెనుకాడటం లేదు. ఈ యాప్‌లు చాలా వరకు హిడెన్ మోడ్‌లోనే ఉంటాయి. పోలీసులు తనిఖీ చేసినా కనపడవు. బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి రావడంతో ప్రధాన బుకీలు, పంటర్లు ఎవరనేది గుర్తించడం కష్టంగా మారుతోంది.

ఆత్మహత్యలూ..

బెట్టింగుల్లో సర్వం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలూ చాలానే ఉన్నాయి. నగరానికి చెందిన ఓ వ్యక్తి బెట్టింగుల్లో సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కుటుంబంతో కలిసి రామేశ్వరంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

- బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, తాళలేక భార్య సైతం బలవన్మరణానికి పాల్పడ్డారు.
- పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓ వ్యక్తి బెట్టింగుల్లో ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలా ఎన్నో కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఇలాంటి ఘటనలు అధిక సంఖ్యలో జరుగుతున్నా, పోలీసుల వరకు వచ్చేవి కొన్నే.

గ్రూప్ - 2 అభ్యర్థులను మోసగించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఆశ్రిత్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): అన్ని వర్గాలను మోసం చేయడమే అలవాటుగా మార్చుకున్న సీఎం చంద్రబాబు తాజాగా గ్రూప్ - 2 అభ్యర్థులను నిలువునా వంచించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి ఆరోపించారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. న్యాయం చేస్తున్నట్లు నటించి చివరికి వారిని నట్టేట ముంచారని మండిపడ్డారు. ఓ వైపు వాయిదా వేయిస్తున్నామని చెప్పి, మరోవైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వం సమావేశమై, అభ్యర్థులకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి గందరగోళం మధ్య పరీక్ష నిర్వహణ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని, ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసుల లాఠీచార్జిని ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికీ ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. వలంటీర్లకు రూ.పది వేలిస్తానని చెప్పి లక్షలాది మందిని తొలగించారని దుయ్యబట్టారు.

రుణాలకు దరఖాస్తుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను కమిషనర్ సూర్యతేజ సమక్షంలో నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించారు. లబ్ధిదారులు తమకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సంబంధిత మెప్మా విభాగ సిబ్బందికి డివిజన్ల వారీగా అందజేశారు. అసంపూర్తిగా ఉన్న వాటిని తిరస్కరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ నందన్ మాట్లాడారు. రుణ మంజూరు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సంబంధిత బ్యాంకుల వారికి ఆయా పత్రాలను అందజేయనున్నామని వివరించారు. బీసీలకు సంబంధించి 3079, కాపు 366, ఈబీసీ 361.. మొత్తం 3806 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ తేదీలను త్వరలోనే తెలియజేస్తామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్‌కు కృషి



అర్జీలను స్వీకరిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంక్ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణకు గానూ ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లతో నగరంలో ప్రచారం చేయాలని కోరారు. టిడ్కో గృహాలు రద్దయిన వారికి వారు చెల్లించిన మొత్తాలను తిరిగివ్వనున్నామని చెప్పారు. వీటిని నూతన లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులు, నూతన రోడ్ల మంజూరు, కాలువల నిర్మాణంపై వినతిపత్రాలు అందాయని వివరించారు. మొత్తం 58 అర్జీలు అందాయని పేర్కొన్నారు. అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌ఓ చైతన్య, డీసీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో ష్రింప్ పాప్ స్టార్టప్



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గల ఆక్వాకల్చర్ విభాగంలో ష్రింప్ పాప్ స్టార్టప్‌ను కోరమాండల్, ఆల్ఫా మెరైన్ కంపెనీల భాగస్వామ్యంతో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. చేప, రొయ్యల రెడీ టు ఈట్ ఉత్పత్తులను విద్యార్థులు తయారు చేయనున్నారని వివరించారు. ఆక్వాకల్చర్ విభాగాధిపతి రంజని, కోరమాండల్ కంపెనీ రీజినల్ మార్కెటింగ్ హెడ్ చక్రధర్, అధ్యాపకులు నారాయణరెడ్డి, స్వాతి, రమాదేవి, నాగేంద్రప్రసాద్, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా నేడు

నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పదికి నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ రిటైల్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని వెల్లడించారు. పది, ఇంటర్, డిగ్రీ చదివిన యువత పాల్గొనవచ్చని, వివరాలకు 86398 67407, 99888 53335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

27 నుంచి సర్టిఫికెట్ కోర్సు

నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ఈ నెల 27న ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. పదో తరగతి, ఆపై చదివిన 18 నుంచి 35 ఏళ్లలోపు మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగాన్ని కల్పించనున్నారని, వివరాలకు 85208 57447 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం ఉదయం నిర్వహించనున్నామని నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

ఆదాయ పన్ను బిల్లును స్వాగతిస్తున్నాం

నెల్లూరు (టౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను బిల్లును స్వాగతిస్తున్నామని కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు చాప్టర్ వైస్ చైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బృందావనంలోని కార్యాలయంలో విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పాన్ని తెలియజేస్తోందని చెప్పారు. ఆదాయ పన్ను బిల్లు సెక్షన్లోని అకౌంటెంట్ నిర్వచనంలో సీఎంఏలను చేర్చాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రంగనాయకులపేట ఫీడర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, కపాడిపాళెం, రైల్వేస్టేషన్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకూడదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహాశివరాత్రిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం తలెత్తకూడదని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శివాలయం వద్ద విద్యుత్ సిబ్బంది ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. సూర్యఘర్ జిల్లా నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, నెల్లూరు టౌన్, రూరల్ ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పడారుపల్లిలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో అన్నదానాన్ని క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రుమటాలజిస్ట్ కురుమేటి కిశోర్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ కీర్తి, వైదేహి, దొడ్ల ప్రమీలమ్మ, మమతారెడ్డి, దగ్గుపాటి రాధాకృష్ణ, సురేష్, మల్లికార్జున, గుమ్మడి రాజగోపాలరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఫౌండేషన్ వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): కలెక్టరేట్లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని అదానీ కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సాధారణ జబ్బులతో పాటు, గుండె, నేత్ర తదితర వైద్యసేవలందించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ ఆనంద్ మాట్లాడారు. కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం వచ్చే అర్జీదారులకు ఇలాంటి వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఏఓ విజయకుమార్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి రామ్, హెచ్‌ఆర్ అడ్మిన్ అనురాగ్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలుకుదాం



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(అర్బన్): యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్‌కు స్వస్తి పలుకుదామని కలెక్టర్ ఆనంద్ సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్‌తో చెత్త పేరుకుపోతోందని చెప్పారు. రీసైక్లింగ్ ప్రాసెస్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రీసైక్లింగ్‌తో ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి బీటీ రోడ్లను వేయాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(అర్బన్): ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్లను కలెక్టరేట్లో సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్థిక ఉత్పత్తులు, వినియోగదారులుగా వారి హక్కులపై అవగాహన కల్పించనున్నామని వివరించారు. జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పరిశీలన



నెల్లూరు(క్రైమ్): మూలాపేట, రాజీవ్‌గృహకల్ప, మనుమసిద్ధినగర్, ఎమ్ - 1 థియేటర్స్ రోడ్డు తదితర ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలను డ్రోన్ కెమెరాల ద్వారా చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు, మాదకద్రవ్యాలు, జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. నగరాన్ని డ్రోన్ నిఘా నీడలోకి తీసుకొచ్చామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమిస్తే తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన



నెల్లూరు(అర్బన్): కోవూరు కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలో 2013 నుంచి 2022 వరకు ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీ వరకు కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద కార్మికులు ఆందోళనను కోవూరు కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు బకాయిల చెల్లింపునకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృషి చేయాలని కోరారు. ఫ్యాక్టరీ, ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రమిచ్చారు. షుగర్ ఫ్యాక్టరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, నేతలు గోనె దయాకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై మూలస్థానేశ్వరుడి విహారం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో శేషవాహనంపై స్వామివారు సోమవారం దర్శనమిచ్చారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. భువనేశ్వరి, మూలస్థానేశ్వరుల నగరోత్సవం కనులపండువగా సాగింది. ఉభయకర్తలుగా బాలయ్య, రామచంద్రయ్య, రాజ్యలక్ష్మి, ఉదయకుమార్, కుసుమప్రియ తదితరులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు

నెల్లూరు(అర్బన్): పీఎంఏవై 2.0 ద్వారా జిల్లాలో ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాన్ని మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. వివిధ పథకాల అమలుపై జిల్లాలోని సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టరేట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గతంలో ఇల్లు మంజూరై శిథిలావస్థకు చేరుకొని నివాసయోగ్యం కాని విధంగా ఉంటే, వారికి కూడా గృహాన్ని మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఆధార్ కార్డుల్లేని గిరిజనులకు పుట్టిన తేదీ సర్టిఫికెట్లను ఇప్పించడంతో పాటు వాటిని తీయించాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ యోజన ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి గృహాలపై సోలార్ ప్యానళ్లను అమర్చాలన్నారు. జేసీ కార్తీక్, జెడ్పీ సీఈఓ విద్యారమ, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.